క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదుతోనే పరిహారం



రైతుల నుంచి ఈకేవైసీ తీసుకుంటున్న వ్యవసాయాధికారులు

గుడిపాల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే పరిహారం అందుతుందని మండల వ్యవసాయాధికారి మాధవి అన్నారు. గుడిపాల పంచాయతీలో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్ తోపాటు ఈ-కేవైసీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే పంట నష్ట పరిహారం అందుతుందన్నారు. పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకొని ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్న వారికి ఆయా గ్రామాల్లో ఈకేవైసీని ప్రారంభించారు.

పరిహారం పంపిణీ



నగదు అందజేస్తున్న వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఏఈ రామిరెడ్డి

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరిలో గురువారం బాధిత కుటుంబానికి వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన నగదును అందజేశారు. పీలేరు మండలం ఎర్రమరెడ్డిపల్లెకు చెందిన పెంచలయ్య గంగిరెద్దులను ఆడించుకుంటూ సంచార జీవనం సాగిస్తున్నారు. జూలై 18వ తేదీ బంగారుపాళెం మండలం పాలేరు బైపాస్ రోడ్డు సమీపంలో బసచేశారు. ఆవు మేతమేస్తూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో బాధితులు స్థానిక ఎంపీటీసీ, వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రామిరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దాంతో ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.60 వేలు నగదు మంజూరు చేసింది. 60 వేల నగదుతో పాటు శిరీష్‌రెడ్డి రూ.2 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రామిరెడ్డి పాల్గొన్నారు.

బండి పత్రాలు ఉంటే స్టేషన్‌లో సంప్రదించండి

చిత్తూరు రూరల్: సారా అక్రమ రవాణా కేసులో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని సంబంధిత యాజమానులు తగిన ఆధారాలతో బీఎన్‌ఆర్‌పేట పోలీసు స్టేషన్‌కు హాజరు కావాలని గురువారం ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపారు. ఏప్రిల్ 24న అక్రమ నాటుసారాను గుడిపాల మండలం నారగల్లుకు చెందిన పూమాణిక్యం టీఎన్20-సీసీ5933 నంబరు గల స్ప్లెండర్ (ద్విచక్ర వాహనం)పై సారా తరలిస్తూ ఉండగా సీజ్ చేశామన్నారు. ఈ వాహనానికి సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్న యజమాని ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

శ్రీవారి భక్తులకు వసతి, అన్నదానం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

చిత్తూరు రూరల్: పెరటాసి నెలకు పురస్కరించుకుని నడకదారిన వెళ్లే శ్రీవారి భక్తులకు వసతి, అన్నదానం చేయనున్నట్లు ఓం నమో వేంకటేశాయ అన్నదాన ట్రస్టు సభ్యులు హరిప్రసాద్‌రెడ్డి, వేలు అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఏడాదిలాగే ఈసారి కూడా పెరటాసి నెలను పురస్కరించుకుని చిత్తూరు మీదుగా తిరుమలకు నడకదారిన వెళ్లే భక్తులకు విశ్రాంతి వసతి కల్పించడంతో అన్నదానం చేయనున్నామన్నారు. ఈ నెల 18 నుంచి అక్టోబర్ 17వతేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల సాధ్యం



గుడిపాల: పౌష్టికాహారంతోనే పిల్లల ఎదుగుదల సాధ్యమవుతుందని కమ్మతిమ్మాపల్లె సర్పంచ్ కోమల అన్నారు. కమ్మతిమ్మాపల్లె పంచాయతీ చలిచీమలపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టిక మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పౌష్టికాహార ప్రాముఖ్యతపై గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలత, టీచర్లు గిరిజ, వైద్య సిబ్బంది షీలా, దీప తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికే అత్యధిక ప్రాధాన్యం



పూతలపట్టు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గౌరి



ఐరాల: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై గురువారం అపోలో మెడికల్ కళాశాల ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులకు పలు అంశాలపై చైతన్యం కల్పించారు. ఆరోగ్య సిబ్బంది శుక్రవారం నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి అవగాహన కల్పిస్తారని చెప్పారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏడు రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీజనల్, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించడానికి ఈ సర్వే ఉపయోగకరమన్నారు. ఈనెల 30 నుంచి ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని కమిషనర్ అరుణ తెలిపారు. ఆరోగ్య శ్రీ, 108, 104 వంటి పథకాలు ఎంతో ఉపయోగకరమని డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ కిరణ్, ఎంహెచ్‌ఓ లోకేష్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా నిర్వహించాలి

తవణంపల్లె: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పరిరక్షించడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు భాగస్వామ్యంతో ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ప్రజలకు ఉన్న వ్యాధులను గుర్తించి యాప్‌లో నమోదు చేయించాలని సూచించారు. వైద్యాధికారులు ధాత్రేయచౌదరి, వినయ్‌కుమార్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఐరాల: ప్రజల ఆరోగ్యం కోసం నేటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. గురువారం పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, సీహెచ్‌ఓ సుగుణవతి, పీహెచ్‌ఎన్ జీవకళ పాల్గొన్నారు.

సర్వేలు పకడ్బందీగా చేయండి

పూతలపట్టు: జగనన్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన సర్వేలను వలంటీర్లు పకడ్బందీగా చేయాలని ఎంపీడీఓ గౌరి తెలిపారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వలంటీర్లు, ఏఎన్‌ఎంలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, జశ్వంత్, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి



పారిశుధ్య పనులపై సూచనలిస్తున్న నగర కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగర పరిశుభ్రతపై దృష్టి పెట్టి, ప్రధాన సర్కిల్స్, ప్రధాన రహదారులను శుభ్రంగా ఉంచాలని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. నగరంలోని గాంధీ విగ్రహం కూడలి, గిరింపేట పరిధిలోని సర్కిల్స్‌ను గురువారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాంధీ విగ్రహ కూడలిలో అన్ని ప్రాంతాలు శుభ్రంగా ఉండాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. దుకాణదారులు వ్యర్థాలను రోడ్లపై పడేయకుండా నిర్దేశించిన చెత్త బుట్టలో వేసేలా అవగాహన పెంచాలని చెప్పారు. దుకాణాల వద్ద శుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరింపేటలో చౌడేశ్వరమ్మ సర్కిల్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం బీసీ భవన్ పరిసరాల్లో శుభ్రతా పనులను పరిశీలించారు. వార్డుల్లో పారిశుధ్య పనుల నిర్వహణపై సంబంధిత పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్య సేవలు

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రభుత్వం పేదల చెంతకే మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

189 కొత్తపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లెలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హరి అన్నారు. 189 కొత్తపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి హరి 59 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉమ, సునీత, చంద్ర, ప్రవీణ్, ఎలవతి తదితరులు పాల్గొన్నారు.



ఐరాల: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరి

గణేష్ ఉత్సవాలకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: గణేష్ ఉత్సవాలను సజావుగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ, డీఎస్పీ శ్రీనివాసమూర్తి కోరారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై గురువారం సాయంత్రం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పోలీసు అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్, డీఎస్పీ మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనం కోసం మూడు రోజులపాటు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రధానంగా నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక లైటింగ్, క్రేన్లు, తాగు నీరు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి రోజున 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేకంగా సంప్రదాయ వంటకాలు, తృణధాన్యాలు, చిరుధాన్యాల వినియోగంపై డ్వాక్రా సంఘాల ఉత్పత్తులతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. హెల్ప్ డెస్క్, వైద్య బృందాన్ని కూడా నిమజ్జన ప్రాంతంలో అందుబాటులో ఉంచుతామన్నారు. గజ ఈతగాళ్ల కోసం క్రీడాశాఖను కోరుతున్నామని వివరించారు. పోలీసులు ఏర్పాటు చేసే ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సూచనలు అందించారు. ఈ సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ భారతి, మునిసిపల్ ఇంజనీరు గోమతి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, మెప్మా సీఎంఎం గోపి, గణేష్ ఉత్సవ కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌వోవాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల కళాశాలలో గురువారం ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. చిత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డి సొంత నిధులతో ఆ పాఠశాలలో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆ పాఠశాల అధ్యాపకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిరణ్మయి, ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు శేఖర్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భువనేశ్వరి, వైస్ చైర్మన్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల గుట్టలో విశేష పూజలు



చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీ టి.వేపనపల్లె సమీపంలోని గోవిందరాజుల గుట్టలో గురువారం గోవింద నామస్మరణ మార్మోగింది. తాళంబేడు, జంభూగోళంపల్లి, టి.వేపనపల్లి, దిగువమాసాపల్లి గ్రామస్తులు విశేషపూజలు నిర్వహించారు. శ్రీవారి పాదాలను కొలిచారు. సర్పంచ్ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వం నుంచి ఈ గుట్టను గోవిందరాజుల గుట్టగా పిలిచేవారన్నారు. ఇక్కడ శ్రీవారి పాదం ఉన్నట్లు తెలియదని, ఈగుట్టలో ఉన్న ఈ బండపై శ్రీవారు పాదాన్ని గ్రామస్తులు గుర్తించారన్నారు. అప్పటి నుంచి ఇక్కడ విశేష పూజలు చేస్తున్నట్లు తెలిపారు. గుట్ట అభివృద్ధికి త్వరలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుడిపాల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పల్లూరు దళితవాడకు చెందిన సాల్‌మాన్‌రాజ్(55) ద్విచక్రవాహనంపై చిత్తూరు నుంచి ఇంటికి వస్తుండగా మద్రాస్ క్రాస్‌రోడ్డు వద్ద కారు వెనుక నుంచి ఢీ కొనడంతో సాల్మన్‌రాజ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యా..మా బిడ్డే ఇచ్చేయండి!

చిత్తూరు రూరల్: ''అయ్యా..బాత్‌రూంలో వదిలి వెళ్లింది..మా బిడ్డే...తిరిగి ఇచ్చేయండి...'' అంటూ ఆ పసికందు తల్లిదండ్రులు గురువారం ఆస్పత్రి అధికారులను వేడుకున్నారు. ఆగస్టు 16వతేదీన చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి బాత్‌రూంలో ప్రసవించిన తల్లి..పసికందును అక్కడే వదిలి వెళ్లిన విషయం విదితమే. ఈ ఘటనపై సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన అధికారులు బిడ్డను రక్షించి, ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా బంగారుపాళెం మండలం తగ్గువారిపల్లెకి చెందిన దంపతులుగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో బిడ్డను తమకు ఇచ్చేయండి అంటూ పసికందు తల్లిదండ్రులు ఆస్పత్రి అధికారుల ముందు వచ్చి నిలబడ్డారు. బిడ్డను ఐసీడీఎస్ ఆస్పత్రి అధికారులకు అప్పగించామని, ఇక వారి చట్ట ప్రకారమే జరుగుతాయని సమాధానమిచ్చినట్టు సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఐరాల: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కోమల అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాలకల జెడ్పీ హైస్కూల్లో గురువారం స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలుర, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్న పాఠశాలలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. పాలకల జెడ్పీ హైస్కూల్లో వాలీబాల్ పోటీలకు సుమారు 200 మంది హాజరైనట్లు ఎస్‌జీఎఫ్(స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్) మండల కో-ఆర్డినేటర్ దేవ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సతీష్‌నంద, నాగరాజు, శాంతాకుమారి, మహారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ భాషా దినోత్సవం



బంగారుపాళెం: టేకుమంద హైస్కూల్‌లో హిందీ కవుల వేషధారణలో విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థి హిందీ భాష ప్రాధాన్యతను తెలుసుకోవాలని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. గురువారం ఆ కళాశాలలో జాతీయ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందీని జాతీయ భాషగా రాజ్యాంగంలోనే పొందుపరిచారన్నారు. అతిథిగా పాల్గొన్న పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ లెక్చరర్ సిద్దమణి, వైస్ ప్రిన్సిపల్, సావిత్రమ్మ కళాశాల తెలుగు అధ్యాపకురాలు ఉషారాణి తదితరులు మాట్లాడుతూ మాతృభాషతో పాటు అదనంగా జాతీయ భాష కూడా నేర్చుకోవడం వల్ల రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని చెప్పారు. హిందీ అధ్యాపకురాలు షమ్స్ అక్తర్ మాట్లాడుతూ హిందీ భాషను అందరికీ నేర్పాలనే ఉద్దేశంతో హిందీ-తెలుగు స్పెషల్ సర్టిఫికెట్ కోర్సును కళాశాలలో ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంధ్యారాణి, రాజ్యలక్ష్మీ, తిరుకుమరన్, కౌసర్‌జహాబేగం పాల్గొన్నారు.

విద్యార్థులు హిందీ నేర్చుకోవాలి

బంగారుపాళెం: జాతీయ భాష అయిన హిందీని విద్యార్థులు నేర్చుకోవాలని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు దేవకి అన్నారు. మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం జాతీయ హిందీ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. హిందీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు హిందీ కవుల వేషధారణతో అలరించారు. వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

యాదమరిలో..

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జాతీయ భాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం గిరిరాజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హిందీ ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, షహనాజ్ ఖానమ్, కల్పన మాట్లాడుతూ, విద్యార్థులకు హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు

పూతలపట్టు(యాదమరి): టీడీపీ అధినేత నారా చంద్రబాబును సీఐడీ అధికారులు అన్ని ఆధారాలతో అరెస్టు చేస్తే ఎలాంటి ఆధారాల్లేవని టీడీపీ నాయకులు చెప్పడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో నారా చంద్రబాబు నాయుడు రూ.371కోట్లు స్వాహా చేశారని జీఎస్టీ, ఇంటెలిజెన్స్, ఐటీ, సీఐడీ అధికారులు ఆధారాలను కోర్టు ముందుంచారని స్పష్టం చేశారు. చంద్రబాబు దోపిడీ దొంగ అన్న విషయం అందరికీ తెలిసిపోయిందని చెప్పారు. ఈ సారి ఎన్నికల్లో మరోసారి టీడీపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

టీడీపీ పాలనంతా అబద్ధాలు, మోసాలు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు
- మండలంలో కొత్త పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్: టీడీపీ పాలన అంతా అన్నీ అబద్ధాలు.. పచ్చి మోసాలతోనే సాగిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దుయ్యబట్టారు. చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ప్రభుత్వ పథకాలు అందేవి కాదన్నారు. కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులకు మాత్రమే లబ్ధి చేకూరిందన్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల పింఛన్లను నిర్దాక్షిణ్యంగా తొలగించారని గుర్తు చేశారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి వచ్చాక పార్టీలకతీతంగా పథకాలు ప్రతి పేదవాడి తలుపును తడుతున్నాయని చెప్పారు. ఇదివరకు 4,674 మంది పింఛన్ పొందుతుండగా, కొత్తగా మరో 270 మందికి వివిధ పింఛన్లు మంజూరయ్యాయని ఆయన పేర్కొన్నారు.



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ జయరాం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, నాయకులు త్యాగరాజులు, సంపత్, ప్రతిమారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం

బంగారుపాళెం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా అన్నారు. బంగారుపాళెం -1,2 గ్రామ సచివాలయాలలో 62 మందికి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయగా, ఆయన వాటిని లబ్ధిదారులకు సర్పంచ్ ఉమాదేవితో కలిసి అందజేశారు. మొగిలివెంకటగిరి పంచాయతీలో వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి కొత్త పింఛన్లు అందజేశారు. జంబువారిపల్లె గ్రామ సచివాలయంలో సింగిల్ విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా మంజూరైన 25 మందికి పింఛన్లు అందజేశారు.

కొత్త పింఛన్లు

పూతలపట్టు: మండలంలోని పోలవరం, పంటపల్లి పంచాయతీలలోని లబ్ధిదారులకు మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి కొత్త పింఛన్లు అందజేశారు. వృద్ధాప్య పింఛన్లు 8, దివ్యాంగులు 7, వింతతువు 1, మిగిలినవి 2 పింఛన్లను అందజేశారు.

పబ్లిక్ నోటీస్

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన షెడ్యూలు దాఖల ఆస్తి పై నా కక్షిదారులైన శ్రీ షేక్ సమీర్ సాహెబ్ మరియు 4 ఇతరులు అనువారు ప్రతి వాదులైన **1.ఆర్.వెంకట ప్రసాద్ S/o లేట్ ఆర్.శ్రీనివాసులు నాయుడు,డి.నెం.13-14,పార్కువీధి,పాకాల, 2.ఆర్.అభిరాం S/o** ఆర్.వెంకటప్రసాద్, **డి.నెం.13-14,పార్కువీధి,పాకాల,3.ఆర్.అన్విష D/o** ఆర్.వెంకటప్రసాద్,**డి.నెం.13-14,పార్కువీధి,పాకాల** అను వార్లు పై **చిత్తూరు మూడవ అదనపు జూనియర్ సివిల్** జడ్జి కోర్టు నందు కేసు వేసివున్నారు. సదరు కేసు నెం. **O.S.No.821/2023** గా నమోదు కాబడి విచారణలో ఉన్నది. కాగా దిగువ తెలిపిన ఆస్తిని నా కక్షిదారుల ప్రమేయము లేకుండా ప్రతివాదులు అమ్ముటకు ప్రయత్నించు చున్నారని తెలిసినది. కావున ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుల ప్రమేయము లేకుండా సదరు ఆస్తి పై ఎవరైనా క్రయ,విక్రయ,మరే ఇతర లావాదేవీలు జరిపిన అవి చెల్లనేరవు మరియు అట్టి లావాదేవీలపై మా కక్షిదారు తీసుకొను **క్రిమినల్,సివిల్ చర్యలకు** బాధ్యులగుదురని హెచ్చరించడమైనది.

ఎ. షెడ్యూలు: చిత్తూరు డిస్ట్రిక్ట్, చిత్తూరు సబ్ డిస్ట్రిక్ట్ - చిత్తూరు మండలం -చిత్తూరు మునిసిపాలిటీ - నెం.74 తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామ లెక్క దాఖల,సర్కారీ - సర్వే నెం. 514, విస్తీర్ణం ఎ.2.00 సెంట్లు ఈ క్రింది హద్దులలో
తూర్పు : బి షెడ్యూలు ఆస్తి, పడమర : నందు కాలువ, ఉత్తరం : కసిం కాలువ, దక్షిణం :తునాంబి దొర కన్నమ్మ మరియు ఇతరుల భూములు.
ఈ మధ్య విస్తీర్ణం ఎ.2.00 సెంట్లు లేక 0.810 హెక్టార్లు లేక 9680 చదరపు గజములులో గల చెట్లు వగైరాలు

బి. షెడ్యూలు : చిత్తూరు డిస్ట్రిక్ట్, చిత్తూరు సబ్ డిస్ట్రిక్ట్ - చిత్తూరు మండలం -చిత్తూరు మునిసిపాలిటీ - నెం.74 తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామ లెక్క దాఖల,సర్కారీ - సర్వే నెం. 514, విస్తీర్ణం ఎ.0.25 సెంట్లు ఈ క్రింది హద్దులలో
తూర్పు : పి.నారాయణ స్వామి, గోవిందరాజులు మొదలి ల భూములు, పడమర : ఎ షెడ్యూలు ఆస్తి, ఉత్తరం :కసిం కాలువ, దక్షిణం :తునాంబి దొర కన్నమ్మ మరియు ఇతరుల భూములు.
ఈ మధ్య విస్తీర్ణం ఎ.0.25 సెంట్లు లేక 0.101 హెక్టార్లు లేక 1219 చదరపు గజములులో గల చెట్లు వగైరాలు

MD షఫీరుల్లా, అడ్వకేట్,చిత్తూరు